ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 14 జూలై 2025





కురుమ సంఘం సభ్యత్వం ఇస్తున్న సదానందం

రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం

పరిగి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కురుమలు రాజ్యాధికారం సాధించే దిశగా పోరాటం చేయాలని కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం అన్నారు. పరిగిలో ఆదివారం టీవీ నర్సింహులు అధ్యక్షతన కురుమ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాత్రమే అయ్యారని పేర్కొన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న కురుమలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కురుమ సంఘం పరిగి డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీవీ నర్సింహులు, గౌరవ అధ్యక్షుడు వార్ల అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయేల్ల మల్లేశ్(మిట్టకోడూరు), ఉపాధ్యక్షులుగా వెంకటయ్య(పుడుగుర్తి), అంబయ్య(గుండాల్), కార్యదర్శులుగా రాంచంద్రయ్య(కులకచర్ల), బాలయ్య(కామునిపల్లి), కోశాధికారిగా కృష్ణ(కంకల్), కార్యవర్గ సభ్యులుగా నర్సింహులు(రంగాపూర్), భాస్కర్(కులకచర్ల), శ్రీశైలం(మిట్టకోడూరు) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు జైదుపల్లి గోపాల్, పుడుగుర్తి వెంకటయ్య, ప్యాట నర్సింహులు, తొండపల్లి, మల్లేశ్, మల్లేశం, శ్రీశైలం పాల్గొన్నారు.



మర్పల్లి ఎస్సైకి తీర్మానపత్రం అందిస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్‌లో మద్యపాన నిషేధం

మర్పల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామంలో మద్యపానాన్ని నిషేధిస్తూ గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామంలో గల్లీ గల్లీకి బెల్టు షాపులు వెలిశాయని, దీంతో గ్రామ యువత మద్యానికి బానిసలవుతున్నారని గ్రామస్తులు మద్యాన్ని నిషేధిస్తూ ఆదివారం తీర్మానం చేశారు. ఇక నుంచి గ్రామంలో మద్యం విక్రయిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోజు కూలీ చేసే వారు మద్యానికి బానిసై అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. ఈ సందర్భంగా తీర్మాన కాపీని మర్పల్లి ఎస్సై గఫార్‌కు అందించారు.

స్వాతంత్రోద్యమ సమయంలో 'కల్లు మానండోయ్.. కళ్లు తెరవండోయ్' అనే నినాదం సమాజంలో చైతన్యాన్ని నింపింది. ఇప్పుడు కూడా అలాంటి ఉద్యమం ఒకటి మొదలవ్వాల్సిన అవసరం కనిపిస్తున్నది. కల్తీ కల్లుకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి మృతి చెందిన ఘటనతోనైనా మేల్కోకపోతే కుటుంబాలు ఛిద్రమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఇక మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో కల్తీ కల్లు తయారీ, వ్యాపారం జోరుగా సాగుతున్నది. ఏమైనా ఘటనలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా తనిఖీలు చేసి నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకుంటున్నారని జిల్లా వాసులు ఆరోపిస్తున్నారు.



కల్తీ కల్లోలం

మందు కల్లుకు బానిసవుతున్న జనం

- ప్రజల ప్రాణాలతో వ్యాపారుల చెలగాటం
- ఒక్క లైసెన్స్‌తో నాలుగు దుకాణాలు!
- ఛిద్రమవుతున్న కుటుంబాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మేడ్చల్, జూలై 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఉపాధి కోసం పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పనుల కోసం వలస వస్తుంటారు. వివిధ పనుల్లో స్థిరపడుతున్న వారు కల్తీ కల్లుకు బానిసలౌతున్నారు. ఎక్కడ నాలుగు కంపెనీలున్నా, నిర్మాణ పనులు జరుగుతున్నా, వలస వచ్చిన వారు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కల్లు దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో కల్లు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తున్నది. ఓ వైపు ప్రభుత్వం స్వచ్ఛమైన ఈత కల్లు, నీరా వంటి వాటిని ప్రోత్సహిస్తున్నా కల్తీ కల్లులో వచ్చే మత్తు స్వచ్ఛమైన కల్లులో లేకపోవడంతో కల్తీ కల్లుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఒక్కసారి కల్తీ కల్లుకు అలవాటు పడితే అంతే సంగతులు. ఎంత ఖరీదైన



బ్రాండ్ మద్యం తాగినా చివరకు కల్తీ కల్లు తాగకుండా ఉండలేక పోతున్నారు. జిల్లాలో ఎక్కడపడితే అక్కడ కల్లు దందా నడుస్తోంది. కల్లు వ్యాపారులు పెద్ద పెద్ద స్థావరాలు ఏర్పాటు

మిగతా 8వ పేజీలో...

కల్లు నమూనాలు సేకరిస్తున్నాం

జిల్లాలో కల్లు తయారీ, కల్లు కాంపౌండ్లలో రెండు రోజులుగా దాడులు నిర్వహిస్తున్నాం. కల్లు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నాం. ల్యాబ్ నుంచి రిపోర్టులు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే తెలియజేయాలి.

- ఫయాజుద్దీన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, మేడ్చల్

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో కల్లు దుకాణాల వివరాలు

	టీసీఎస్	టీసీఎస్ దుకాణాలు	టీసీఎస్ సభ్యులు	టీఎఫ్‌టీ దుకాణాలు	టీఎఫ్‌టీ లైసెన్స్‌లు	మొత్తం సభ్యులు
మల్కాజిగిరి	77	79	1,811	15	84	1,895
మేడ్చల్	50	52	821	44	303	1,124

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య



యాలాల, జూలై 13(ఆంధ్రజ్యోతి): కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించే జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం అంబేడ్కర్ అభయహస్తం పథకంలో దళిత కుటుంబాలకు రూ.12లక్షలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసంతో దళితులకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజలకు వైద్యం అందించాలని కోరారు. నేడు, రేపు జరిగే తరగతులకు జిల్లా వ్యాప్తంగా 600 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, నాయకులు శోభన్, కోట రమేష్ తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.



నాణ్యతకు తిలోదకాలు! 8

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం? క్యూరింగ్ చేయకుండా వదిలేసిన వైనం

రైతులకు ఆర్బీఓఎల్ ఊతం! 7

ఇథనాల్ తయారీకి వ్యవసాయోత్పత్తుల కొనుగోలు కంపెనీ రాకతో రెట్టింపు స్థాయిలో వరి సాగు



తాండూరు రూరల్: బిజ్వార్‌లో బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

బోనం.. పరవశించిన భక్త జనం

ఊరూరా ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. ఆదివారం గ్రామ దేవతలు ఊరడమ్మ, మైసమ్మ, పోషమ్మ అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం పూట ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం మహిళలంతా నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మకు నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పాడిపంటలు బాగా పండాలంటూ మొక్కుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 13



ధారూరు: నాగసముందర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నేడు పరిగిలో మంత్రి కొండా సురేఖ పర్యటన

పరిగి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పరిగి నియోజకవర్గంలో సోమవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పర్యటించనున్నారు. మంత్రితోపాటు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆమెతోపాటు పాల్గొంటారు. సోమవారం ఉదయం 11 గంటలకు పరిగిలోని ఎస్సీ కాలనీ సీతారామాంజనేయస్వామి ఆలయం, పోచమ్మ ఆలయాన్ని ప్రారంభిస్తారు. మైసమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11.30 గంటలకు శ్రీనివాసకాలనీలో నిర్వహించే వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటుతారని కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యులు తెలిపారు.


అనంతగిరిలో 'వరల్డ్ పేపర్ బ్యాగ్‌డే'

వికారాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): సుమారు మూడు వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న అనంతగిరి అడవుల్లో పర్యాటకులు వదిలేసిన ప్లాస్టిక్ కవర్లు, తాగి పడేసిన మద్యం బాటిళ్లు జీవరాశులకు హాని కలిగిస్తున్నాయని వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్యామ్ అన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డెక్కన్ వుడ్స్ అండ్ ట్రయల్స్ ఆధ్వర్యంలో తెలంగాణ అటవీ శాఖ, స్విచ్ ఎకో ఎలిమా సంస్థల సహకారంతో ఆదివారం వికారాబాద్ అనంతగిరి హిల్స్‌లో వరల్డ్ పేపర్ బ్యాగ్ డే నిర్వహించారు. ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు ఫారెస్ట్ గెస్ట్ హౌస్ పరిసరాలు, ట్రెక్కింగ్ మార్గాల్లో కూరగాయాల కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర చెత్త పదార్థాలను తొలగించారు. ఇందులో 20 మంది వలంటీర్లు, 10 మంది ఫారెస్ట్ బీట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ.. తాగి పడేసిన మద్యం బాటిళ్లకు జింకలు, అడవి పందులు, నెమళ్లు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకులు ప్లాస్టిక్ తీసుకురావద్దని, చెత్తను అడవిలో వేయొద్దని విజ్ఞప్తి చేశారు. స్విచ్ ఎకో డైరెక్టర్ అక్షయ్ దేశ్ పాండే హెడ్ నేచరలిస్ట్ అఖిల్ మాట్లాడుతూ.. డెక్కన్ వుడ్స్ చుట్టూ సుమారు 550 కేజీల ప్లాస్టిక్, మెటల్, గ్లాస్ పదార్థాలు తొలగించినట్లు తెలిపారు. భూమిలో ప్లాస్టిక్ కరగడానికి 500 సంవత్సరాల సమయం పడుతుందని, ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి అరుణ, బీట్ అధికారి శ్రీజ, జూనియర్ నేచరలిస్ట్ నర్సింహ, బీట్ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



అనంతగిరిలో సేకరించిన ప్లాస్టిక్

కొత్త కార్డులొస్తున్నాయ్..



- రేషన్ కార్డుల పంపిణీకి సన్నాహాలు
- నేడు జిల్లాకు చేరుకోనున్న కార్డులు
- పంపిణీ చేయనున్న అధికారులు, నాయకులు

వికారాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదల కల సాకారం కాబోతోంది. కొత్త రేషన్ కార్డులు అందించేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ ఏడాది జనవరి 26న ప్రారంభించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరాటంకంగా కొనసాగుతోంది. మీసేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్ పరిశీలించి ఆన్‌లైన్ ద్వారా పౌర సరఫరా అధికారులకు పంపిస్తుండగా.. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా కొత్త కార్డులను ఆమోదిస్తున్నారు. గత జనవరి వరకు జిల్లాలో మొత్తం 2,41,169 రేషన్‌కార్డులు ఉండగా, వాటిలో ఆహార భద్రత కార్డులు 2,14,476, అంత్యోదయ 26,657, అన్నపూర్ణ 36 కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో 8,08,896 మంది కుటుంబ సభ్యులు ఉండగా, వారికి 5,335.597 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేసేవారు.

మండలానికి 700 నుంచి 900 కార్డులు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆర్థిక, సామాజిక సర్వేలో కొత్త రేషన్ కార్డుల కోసం 22 వేల మంది దరఖాస్తు చేసుకోగా మీసేవ ద్వారా 23,543 దరఖాస్తులు వచ్చాయి. గత జనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక గ్రామంలో అర్హులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అప్పట్లో జిల్లాలోని 20 గ్రామాల్లో 719 రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తుల ఆధారంగా గత మే 28వ తేదీ వరకు జిల్లాలో 9,928 కొత్త రేషన్ కార్డులు జారీ చేయగా, వాటి ద్వారా 88,374 మంది కొత్త కుటుంబ సభ్యులు రేషన్ పొందడానికి అర్హులయ్యారు. కాగా, ఫిబ్రవరి నుంచి ఈనెల 8వ తేదీ వరకు కొత్త రేషన్ కార్డుల సంఖ్య 13,921కు పెరిగింది. ప్రతి మండలంలో 700 నుంచి 900 వరకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు సమాచారం. పాత కార్డుల్లో అనర్హత కలిగిన 1,300లకు పైగా కార్డులను రద్దు చేయగా, కొన్ని

మిగతా 8వ పేజీలో...

బస్సుల కోసం పడిగాపులు

కొడంగల్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సమయపాలన లేని బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తాండూర్ -మహబుబ్‌నగర్, మహబుబ్‌నగర్ - తాండూర్‌కు ప్రతిరోజు 100 ట్రిప్పులకు పైగా బస్సులు నడుస్తాయి. కానీ ఒకేసారి అన్నీ బస్సు లు తాండూర్‌కు, మహబుబ్‌నగర్‌కు వెళ్లడంతో ఆయా మార్గాల్లో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచుస్తూ నిలుచున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో బస్సులు కిక్కిరిసి పోతున్నాయి.



కొడంగల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



మాట్లాడుతున్న అబ్దుల్ వాహెబ్

మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ వాహెబ్

బంట్వారం, జూలై 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా రాష్ట్రంలో మైనారిటీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ వాహెబ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తొర్మామిడి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. మైనారిటీల పట్ల వివక్ష చూపితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో మైనారిటీలకు 14శాతం రిజర్వేషన్ అమలులోకి తేచ్చే విధంగా ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో మైనార్టీల భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. మంత్రి వర్గంలో మైనార్టీలకు హోంశాఖ కేటాయించాలన్నారు. వక్ఫ్ బోర్డు పరిరక్షణకు లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. మైనారిటీ విద్యార్థులు, మహిళలు, యువతకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మైనారిటీల హక్కుల పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా బంట్వారం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎండీ షేర్ అలీ, అధికార ప్రతినిధిగా ఖాజా పాషా, వైస్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ ముస్తఫా, సెక్రటరీగా మౌలానాషేక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ బాబా, ట్రెజరర్‌గా అహ్మద్ భాయ్, యూత్ ప్రెసిడెంట్‌గా మొహమ్మద్ సమీర్, వైస్ ప్రెసిడెంట్ తాజొద్దీన్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మీరాసాబ్ బషీర్ మియా, సోషల్ మీడియా ఇన్‌చార్జులుగా ఆసిఫ్, ఖాదర్, హిదాయత్,సలహాదారులుగా మొహమ్మద్ ఇఫ్తెకర్ అలీ, మొహమ్మద్ సలీం, సయ్యద్ నజీర్, రోంపల్లి ఫిరోజ్, మున్నాభాయ్, గోరె మియాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ వసీమ్, వైస్ ప్రెసిడెంట్ జహీర్ పాషా, తాలూకా కన్వీనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కొండెంగల హల్‌చల్

● వానర గుంపులతో భయపడిపోతున్న మహిళలు, పిల్లలు

చేవెళ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో గత కొద్ది నెలలుగా కోతులు, కొండెంగలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆదివారం చేవెళ్లలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ పూజారి ఇంటి గేటుపై ఎనిమిది కొండెంగలు కూర్చుని ఇంట్లో వారిని భయభ్రాంతులను చేశాయి. కర్రలతో అదిరించగా వానరాలు దూరంగా వెళ్లిపోయాయి. గత కొద్ది నెలలుగా చేవెళ్లలోని ఆయా కాలనీల్లో ఇండ్లపై రోజూ గుంపులుగా కొండెంగలు తిరుగుతూ మీదిమీదికి వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మహిళలు, పిల్లలను తరుముతున్నాయని చెబుతున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు కొండెంగలను అడవుల్లో వదిలేయాని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


ఓ ఇంటి ముందు కొండెంగల గుంపు

ప్లాట్ల పంపిణీతో నిర్వాసితుల్లో ఆనందం



యాచారం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ప్లాట్ల పంపిణీతో తమకెంతో మేలు జరుగుతుందని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, మంగలిగడ్డతండా, మర్లకుంటతండా, గొల్లగూడ గ్రామాల నిర్వాసితులు అంటున్నారు. ఫార్మాసిటీకి భూమిచ్చిన ప్రతీ రైతుకు ప్లాట్లు ఇస్తామని నాటి మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అర ఎకరం భూమి కోల్పోయిన రైతులకు కూడా ప్లాట్లు ఇవ్వడం ఆనందాయకం అంటున్నారు. ఎకరం అసైన్డ్ భూమికి రూ.8లక్షలు, ఆక్రమణదారులకు రూ.7.5లక్షలు, ఎకరం పట్టా భూమికి రూ.12.5లక్షల నుంచి రూ.16.5లక్షల పరిహారమిచ్చారు. ప్రస్తుతం ఎకరం పట్టాభూమికి రూ.25లక్షల పరిహారమిచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నాలుగు గ్రామాల్లో ఇప్పటి వరకు 2,814 మంది రైతులకు వారు కోల్పోయిన భూవిస్తీర్ణం మేరకు ప్లాట్లు పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు సైతం ప్లాట్లు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ప్రతీ ఎకరం భూమికి 121 గజాల(ఒక గుంట) చొప్పున ప్లాటు ఇచ్చేలా అధికారులు ప్రణాళికను పక్కాగా అమలుచేస్తున్నారు. ఈ ఒక్కో ప్లాటు ప్రస్తుత ధర రూ.10లక్షల నుంచి 15లక్షల వరకు ఉంటుందని రైతులంటున్నారు. ఒక వేళ వ్యవసాయం చేయాలనుకునే వారు తమ ప్లాట్లను విక్రయించి అచ్చంపేట, కల్వకుర్తి, డిండి వంటి ప్రాంతాల్లో భూమి కొంటామని తెలిపారు.

మాకు రెండు ప్లాట్లు వచ్చాయి



మా భూమి పోయన దాన్ని బట్టి మాకు రెండు ప్లాట్లు వచ్చాయి. వచ్చిన ప్లాట్లలో నేను, నా కొడుకులతో ఇండ్లు కట్టుకుంటాం. మాకు ప్లాట్లు ఇవ్వడంతో భూమి పోయిందన్న బాధ కొంత తీరింది. కొంత ఆర్థిక భరోసా కలిగింది. గతంలో మా భూమి తీసుకున్నందుకు ప్లాట్లు ఇస్తామని నాయకులు, మా గ్రామ పెద్దలు మాటిచ్చారు. మాట ప్రకారం నాకు ప్లాట్లు రావడం సంతోషంగా ఉంది.

- కాసుల రాములమ్మ, మహిళా రైతు, కుర్మిద్ద

మా హయాంలోనే ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చాం



ఫార్మాసిటీ నిర్వాసిత రైతులకు ప్లాట్లు ఇస్తే వారికి ఆర్థిక భరోసా కలుగుతుందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సీఎం కేసీఆర్‌ను ఒప్పించాం. ప్లాట్లు కేటాయించేలా వెంచర్ ఏర్పాటు చేశాం. అప్పట్లోనే రైతులకు ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చాం. ఇందులో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. మా ప్రభుత్వం వెంచర్ చేయడం వల్లే నేడు రైతులకు ప్లాట్లు కేటాయిస్తున్నారు.

- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూపులు


కులకచర్ల ఎంపీడీవో కార్యాలయం

కులకచర్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్‌లు మంజూరు కోసం వితంతువులు, దివ్యాంగులు, కుటుంబ ఆసరా లేని వారు ఎదురుచూస్తున్నారు. అర్హత ఉండి పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొని ఏళ్లుగా వేచి చూస్తున్నారు.గత ప్రభుత్వంలో పాత వారికి పింఛన్లు వచ్చినా యేటా కొత్తగా మంజూరు చేయలేదు. దీంతో నాలుగేళ్లుగా దరఖాస్తుదారులు పింఛన్ కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో వివిధ రకాల పింఛన్ల కోసం 600 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 58 ఏళ్లు నిండిన వారు వృద్ధాప్య పింఛన్‌కు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తులు చేసినా...

ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఊరూరా దరఖాస్తులు స్వీకరించింది. పింఛన్ కోసం వివిధ వర్గాల వారు 450 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు వారికి పింఛన్‌లు మంజూరు చేయలేదు. రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దరఖాస్తుదారులకు ఆశలు రేకెత్తాయి. స్థానిక ఎన్నికల సందర్భంగానైనా ప్రభుత్వం కొత్తవారికి పింఛన్‌లు మంజూరు చేస్తుందని ఆశిస్తున్నారు.

పింఛన్ కోసం ఎదురుచూస్తున్న



నా భర్త మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. నేను కూలి పనులు చేసుకుంటూ కొడుకులతో కలిసి జీవిస్తున్నా. ప్రభుత్వం నాకు వితంతు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. కుటుంబ పోషణ భారమైతోంది.

- శివమ్మ, లాల్‌సింగ్‌తండా

ఎన్నో సార్లు దరఖాస్తు ఇచ్చిన



నాలుగేళ్ల నుంచి ఆసరా పింఛన్ కోసం ఎన్నో సార్లు దరఖాస్తు చేశాను. కానీ ఇప్పటి వరకు నాకు పింఛన్ రాలేదు. కూలి పని చేస్తున్నా. నాకు భార్య, పిల్లలు ఉన్నారు. వృద్ధాప్య పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి.

- లింగం, బండవెల్కిచర్ల

అల్లుకుంటున్న నిర్లక్ష్యం


సంగెంలో ట్రాన్స్‌ఫార్మర్ పోల్‌కు అల్లుకుంటున్న తీగ మొక్క

కేశంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): టాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగల మొక్క అల్లుకుంటోంది. సంగెం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త, చెదారం తొలిగించకపోవడంతో అక్కడ పిచ్చి మొక్కలు పెరిగాయి. అలాగే తీగ జాతికి చెందిన ఓ మొక్క ట్రాన్స్‌ఫార్మర్ స్తంభానికి అల్లుకొని తీగలను చుట్టేసింది. ఇంకా కొన్ని రోజులైతే ట్రాన్స్‌ఫార్మర్‌కు చూట్టుకునే ప్రమాదం ఉంది. అంతేకాకుండా తీగ జాతి మొక్కకు పశువులు, జీవాలు తగిలితే విద్యుత్ షాక్ కొట్టి చనిపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన కొట్టుకుపోయిన మట్టి

● ప్రమాదకరంగా మారుతున్న వైనం



కేశంపేట, జూలై13(ఆంధ్రజ్యోతి): వర్షాలధాటికి రోడ్ల పక్కన పోసిన మట్టి కూలుతోంది. ఇలాగే వదిలేస్తే రోడ్డు పటిష్టతకు ప్రమాదం ఏర్పడే ఆస్కారం ఉంది. సుందరపురం గ్రామ నుంచి తొమ్మిదిరేకుల మీదుగా బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తన్నారు. సుందరాపురం నుంచి కాకునూర్ వరకు డబులు రోడ్డు వేశారు. బీటీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోశారు. ఇటీవలి వర్షాలకు రోడ్డుపై నుంచి నీరు కిందకు పారింది. దీంతో మొరం కొట్టుకపోయింది. మొరం కొట్టుక పోయిన ప్రదేశంలో మరోసారి మట్టికానీ, మొరం కానీ పోయకపోతే రోడ్డు సైతం కొట్టుకుపోయే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ వెంటనే స్పందించిన రోడ్డు పటిష్టత దెబ్బతినకుండ చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా మన్నె వెంకటేశ్

శంకర్‌పల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం శంకర్‌పల్లి మండాలాధ్యక్షుడిగా మోకిలకు చెందిన మన్నె వెంకటేశ్ ఎంపికయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి ఆదివారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకున్నారు. వెంకటేశ్ మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. బీసీలు రాజకీయంగా రాణించాలన్నారు. మండల ఉపాధ్యక్షుడిగా వడ్ల నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శిగా సంపత్‌కుమార్‌లు కూడా నియామకపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు బండమీది వెంకటయ్య పాల్గొన్నారు.


వెంకటేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

గీతా పారాయణం.. సకల పాపహరణం


గీతా పారాయణంలో మహిళలు

వికారాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): భగద్గీత పారాయణం ద్వారా పాపాలు తొలిగిపోతాయని, గీతాపారాయణాన్ని హిందువులంతా నేర్చుకోవాలని గీతా వాహిని బృందం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవిసదానందరెడ్డి అన్నారు. ఆషాడ గీతా పారాయణంలో భాగంగా ఆదివారం వికారాబాద్‌లోని గౌతమి కళాశాలలో గీతా పారాయణాన్ని నిర్వహించారు. చిన్నారులు భగవద్గీత శ్లోకాలు పఠించారు. శ్రీదేవి మాట్లాడుతూ.. గత 7 సంవత్సరాలుగా గీతా పారాయణం చేస్తున్నట్టు, ప్రతి ఆషాడంలో జిల్లా నలుమూలల్లోని ఆలయాలు, ప్రాంతాల్లో పారాయణాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సరళ, జయశ్రీ, లావణ్య, వరలక్ష్మి, మాధురి, ఝాన్సీరాణి, విజయలక్ష్మి, సరిత, నీరజ, సునీత, లక్ష్మి, సంజీవరాణి, అనురాధ, జ్యోత్స్న, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రాజవర్ధన్‌రెడ్డి, యోగా గురువు అనంతయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● బీజేపీ ఏపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు


పూజల్లో సోము వీర్రాజు, ఆచారి తదితరులు

ఆమనగల్లు, జూలై13(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలని బీజేపీ ఏపీ మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దేశాభ్యున్నతి, భద్రత కోసం ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఆదివారం వీర్రాజు పర్యటించారు. కల్వకుర్తి పట్టణానికి వెళ్తున్న ఆయనకు కడ్తాల టోల్‌గేట్ వద్ద ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, నాయకులు ఘన స్వాగతం పలికారు. మైసిగండి మైసమ్మకు పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని బీజేపీ కార్యాలయానికి చేరుకొని పార్టీ నేతలతో సమావేశమయ్యారు. హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని వీర్రాజు నాయకులకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తిలో ఆచారి విజయం తథ్యమని అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ చెక్కాల లక్ష్మణ్, అసెంబ్లీ నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కో-కన్వీనర్ రవిరాథోడ్, నాయకులు శ్రీనివాస్, రెడ్యానాయక్, చందన్‌నాయక్, రాజు, అశోక్, జంగయ్య, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రం ఏర్పాటుకు ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండలం చేసేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. గట్టిప్పలపల్లిని మండలంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 253వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి ప్రజలు పాల్గొన్నారు.

వర్షాల కోసం వరదపాశం



మల్లన్న గుట్ట వద్ద వరదపాశంలో పాల్గొన్న ముద్దెంగూడ గ్రామస్తులు

షాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామస్తులు, రైతులు మల్లన్నగుట్ట వద్ద ఆదివారం వరద పాశంపోశారు. వారు మాట్లాడుతూ... వర్షాలు కురవక పొలాల్లో మొలకలు వాడుతున్నాయని తెలిపారు. 'వరుణదేవా కరుణించు.' అని బండపై పాశం పోసుకుని తిన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యులకు ఇళ్ల స్థలాలు



అసోసియేషన్ సభ్యులతో సినీ నటుడు అలీ తదితరులు

కేశంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వ శివారులో తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రమణ వంక నేతృత్వంలో ఆదివారం 172మంది సభ్యులకు ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున ఇంటి స్థలాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రముఖ నటుడు అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ ముందు చూపుతో ఈ ప్రాంతంలో 2017లో 11ఎకరాల భూమి కొనడం అభినందనీయం అన్నారు. ప్లాట్ల పంపిణీతో అసోసియేషన్ లక్ష్యం నేరవేరిందన్నారు. కార్యక్రమంలో ప్రొడ్యూసర్స్ చాంబర్ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు మల్లేష్, తుమ్మల గోపాల్, రొల్ల రాఘు రాములుగౌడ్, నవీన్, రమేష్, రాఘవేందర్, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీరు సీసాలో చెత్త



బీరు సీసాలో కన్పిస్తున్న చెత్త

దోమ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓ వినియోగదారుడు కొన్ని బీరు సీసాలో చెత్తచెదారం వచ్చింది. మండలంలోని గుడూరుకు చెందిన రమేశ్ స్నేహితుడితో కలిసి గ్రామంలోని బెల్టు షాపులో కింగ్‌ఫిషర్ లైట్ బీరు కొన్నాడు. బీరు మూతవిప్పి తాగుతుండగా కిందిభాగంతో చెత్త పేరుకోవడం కన్పించింది. దీంతో ఆందోళన చెందిన రమేశ్ దుకాణ యజమానిని నిలదీశాడు. దానికి తానేం చేయాలని, కంపెనీ నుంచే అల్ల వచ్చిందని సమాధానం చెప్పాడు. దీంతో రమేశ్ బీరు సీసాను ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాడు. చివరికి బాటిల్‌ను దుకాణంలోనే పారేసి వెళ్లిపోయాడు. ఆది కల్తీ బీరు అని, దానికి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అతడు కోరుతున్నాడు. కాగా ఈ బీర్లను పరిగిలోని ఓ వైన్స్‌లో తెచ్చి గ్రామంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది.

ఫార్మర్ రిజిస్ట్రీకి డబ్బుల వసూలు!

దోమ, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు డబ్బులు ఇవ్వాల్సిందేనని మండల వ్యవసాయ అధికారులు కొత్త నిబంధన తీసుకొచ్చారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఏఈవోలు అక్రమంగా ఫార్మర్ రిజిస్ట్రీకి డబ్బు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో 36 పంచాయతీల్లో 16,606 మంది రైతులు ఉన్నారు. గ్రామాల్లో ఏఈవోలు ఫార్మర్ రిజిస్ట్రీ కొనసాగిస్తున్నారు. మోత్కూర్ క్లస్టర్ ఏఈవోకు మోత్కూర్, అయినాపూర్, ఖమ్మం నాచారం, దోర్నాలపల్లి గ్రామాలున్నాయి. అయినాపూర్‌లో ఏఈవో ఓ ప్రైవేట్ వ్యక్తికి ఏఈవో లాగిన్ ఐడీ ఇచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ చేయిస్తున్నాడు. ఆ వ్యక్తికి డబ్బులివ్వాలని ఏఈవో సూచిస్తుండడంతో చేసేదిలేక రైతులు రూ.50 ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. రూపాయి తీసుకోకుండా ఏఈవోలు చేయాల్సిన పనిని ప్రైవేట్ వ్యక్తితో చేయిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. మోత్కూర్ ఏఈవో వద్దకు రైతులు పనులకు వెళితే వారిపై చిందులేస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి.

నమోదు కార్యక్రమాన్ని ఉచితంగానే చేయాలి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏఈవోలు ఉచితంగా చేయాలి. మోత్కూర్ క్లస్టర్ ఏఈవో డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. డబ్బులు వసూలు చేసినట్లు తెలితే పూర్తిస్థాయిలో విచారణతో శాఖాపరంగా అతడిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్‌రావు, మండల వ్యవసాయ అధికారి

ఆలయంలో ఘనంగా జెండావిష్కరణ

ఘట్‌కేసర్ రూరల్ జూలై 13(ఆంధ్రజ్యోతి): ఘనాపూర్ అనుబంధ ఫకీర్‌టెక్యాంలో ఆదివారం జగదాంబదేవి సహిత సేవాలాల్ మహారాజ్ ఆలయంలో జెండా విష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. లంబాడాల ఆరాధ్య దైవమైన జగదాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ-బాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, గోపాల్‌రెడ్డి, సురేష్‌నాయక్, పూజారి అమర్‌సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



జెండావిష్కరణ, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు

మహిళల మైదాకు సంబురాలు



తలకొండపల్లి : చంద్రధనలో గోరింటాకు చూపుతున్న మహిళలు

● ఆషాఢం నేపథ్యంలో సామూహిక మెహందీ వేడుకలు

తలకొండపల్లి/కందుకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో మహిళలు సామూహిక గోరింటాకు సంబరాలు నిర్వహించుకుంటూ మురిసిపోతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో మహిళలు, యువతులు, చిన్నారుల చేతులు గోరింటాకుతో కళకళలాడుతున్నాయి. చేతుల్లో కొత్తకొత్త డిజైన్లు వేసుకుంటూ ఎర్రగా పండగానే సంతోషిస్తున్నారు. తలకొండపల్లి మండలం చంద్రధనలో ఆదివారం హనుమాన్ ఆలయం వద్ద గోరింటాకు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీఅష్టోత్తర పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం, పూజలు నిర్వహించారు. అలాగే కందుకూరు ఉన్నత పాఠశాలకు పూర్వ టెన్త్(1990-1991 బ్యాచ్) విద్యార్థులు గోరింటాకు సంబురాలను జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు సమ్మేళనాలను జరుపుకోవడం సహజమే కానీ.. అందుకు భిన్నంగా కందుకూరు జెడ్పీ స్కూల్ పూర్వ విద్యార్థినులు ఆషాఢ గోరింటాకు సంబరాల వేడుకగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గోరింటాకు సంబరాల్లో కందుకూరు మహిళలు

రైతులకు ఆర్బీఓఎల్ ఊతం!

● ఇథనాల్ తయారీకి వ్యవసాయోత్పత్తుల కొనుగోలు

- కంపెనీ రాకతో రెట్టింపు స్థాయిలో పెరిగిన వరి సాగు
- రోజూ 2లక్షల లీటర్ల ఇథనాల్, ఈఎన్ఏ ఉత్పత్తి
- స్థానిక రైతులకు తొలగిన మార్కెటింగ్ కష్టాలు



తాండూరులోని ఆర్బీఓఎల్ కర్మాగారం

తాండూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): గతంలో వరి ధాన్యం పండించేందుకు తాండూరు ప్రాంత రైతులు ఆసక్తి చూపేవారు కాదు. మద్దతు ధర లభించక తంటాలు పడేవారు. అలాగే వరి సాగుకు నీటి వసతులు కూడా తక్కువే ఉండేవి. ఐతే ఐదారేళ్లుగా పరిస్థితి మారింది. ఇందుకు ప్రధాన కారణం.. ర్యాడికల్ బయో ఆర్గానిక్ లిమిటెడ్(ఆర్‌బీఓఎల్) కంపెనీ అని చెప్పొచ్చు. పెట్రో ఉత్పత్తులను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్బీవోఎల్‌లో ఇథనాల్ తయారీ చేస్తున్నారు. పదేళ్లుగా మద్యంలో కలిపే ఈఎన్ఏ తయారీ చేసిన ఈ కంపెనీ గతేడాదిగా ఇథనాల్ ఉత్పత్తి చేస్తోంది. ఇథనాల్‌ను 20 శాతం పెట్రోల్‌లో కలిపి మార్కెట్లో విక్రయిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల ఆయిల్ కంపెనీల నుంచి భారీగా ఆర్డర్లు వస్తుండడంతో ఆర్బీవోఎల్ ఉత్పత్తులకు గిరాకీ ఏర్పడింది. త్వరలో జెట్ విమానాలకు సైతం ఇంధనం ఇథనాల్ అందజేసేందుకు సంస్థ సిద్ధమవుతోంది.

వాయు కాలుష్య నివారణకు ఇథనాల్ దోహదం

ఇథనాల్, ఈఎన్ఏ తయారీకి వ్యవసాయ ఉత్పత్తులు చాలా అవసరం. పాడైన బియ్యం, నూకలు, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తుల నుంచి ఇథనాల్‌ను తీస్తారు. గతంలో ఈ ముడిసరుకును ఆర్బీవోఎల్ దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునేంది. గత ఐదారేండ్లుగా తాండూరు ప్రాంత రైతులకు తగిన ప్రోత్సాహం కల్పిస్తూ, వారిలో అవగాహన పెంచి పంట ఉత్పత్తులకు తగిన రేటు పెట్టి ఈ కంపెనీ కొనుగోలు చేస్తోంది. దీంతో స్థానిక రైతులు వరి, మొక్కజొన్న పంటలను పెద్ద మొత్తంలో సాగుచేస్తున్నారు. గత రెండు సీజన్లలో 60వేల హెక్టార్లలో వరి పండిస్తున్నట్టు లెక్కలు వెల్లడిసున్నాయి. మార్కెట్ రేటుకుంటే ఎక్కువ ధరనే ఈ సంస్థ చెల్లిస్తోంది. యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, కొడంగల్, కోస్గి మండలాల రైతులు తమ ఉత్పత్తులను భారీగా ఆర్బీవోఎల్‌కు తరలిస్తున్నారు. 2025 జూలై నాటికి క్వింటాలు నూకలు రూ.2,500 వరకు చెల్లిస్తున్నారు. సరుకు అమ్మిన మూడు నుంచి వారం రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నారు. కంపెనీ నిర్వాహకులు పారదర్శకంగా కొనుగోళ్లు చేపడుతున్నారు. రైతులు పండించిన వడ్లను మిల్లుల్లో నూకలుగా పట్టించి వాటిని ఆర్బీవోఎల్‌కు తరలిస్తున్నారు. చాలామంది చిరు వ్యాపారులు కూడా నూకలు, మొక్కజొన్న వ్యాపారం నిర్వహిస్తూ స్థానికంగా ఉపాధి పొందుతున్నారు. కొందరు రైతుల నుంచి ధాన్యం కొని మిల్లింగ్‌తో నూకలు చేసి కంపెనీకి అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు.

స్టాక్ మార్కెట్ వైపు కంపెనీ చూపు

ఆర్బీఓఎల్ సంస్థ లాభాల్లో నడుస్తున్నందున స్టాక్ మార్కెట్లో లిస్టింగ్, షేర్ల క్రయవిక్రయాలకు యాజమాన్యం ఫోకస్ పెట్టింది. రానున్న రెండు నెలల్లో విపణిలోకి అడుగుపెట్టేందుకు యాజమాన్యం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. తెలంగాణలో ఉన్న నాలుగు ఇథనాల్, ఈఎన్ఏ ఫ్యాక్టరీల్లో లాభాల్లో నడుస్తున్న ఆర్బీవోఎల్ పట్ల మదుపరులు,పెట్టుబడిదారులు షేర్లు కొనేందుకు ఆసక్తిచూపుతారనే చర్చ నడుస్తోంది.

కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో నిర్వహణ



గతంలో రోజుకు 60వేల లీటర్ల ఈఎన్ఏ తయారీ చేసిన ఆర్బీవోఎల్ ప్రస్తుతం రోజూ 2లక్షల లీటర్ల ఉత్పత్తి చేస్తోంది. ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపి వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టొచ్చు. అందుకు ఇలాంటి పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గతంలో 4శాతం ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపి విక్రయించారు. కాలుష్య నియంత్రణలో భాగంగా క్రమంగా ఇథనాల్ కలిపే శాతాన్ని పెంచి ప్రస్తుతం 20శాతం వరకు కలుపుతున్నారు. రాబోయే రోజుల్లో 50శాతం కలిపే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో పాటు జెట్ విమానాల ఇంధనానికి ఇథనాల్ సరఫరా చేసేలా ఉత్పత్తిని భారీగా పెంచనున్నాం.

– బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో, ఆర్బీఓఎల్

బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకులు చరిత్రహీనులే!



ఎంపీ మల్లు రవిని సన్మానిస్తున్న నర్సింహ, గుర్రం కేశవులు

ఆమనగల్లు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ వ్యాపితంగా ప్రభావితం చేసిందని, ఈ రిజర్వేషన్ల వ్యతిరేకులు చరిత్రహీనులుగా మిగులుతారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. బీసీ రిజర్వేషన్లను షెడ్యూల్ 9లో చేర్చి చట్టబద్ధత కల్పించేలా కేంద్రంపై వొత్తిడికి బీజేపీ మంత్రులు, రాష్ట్ర ఎంపీలు చొరవ చూపాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ ఆదివారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు,పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, ఆమనగల్లు, కడ్తా ల మండలాల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఎంపీని హైదరాబాద్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో వివిధ సామాజిక వర్గాల కు అత్యధిక రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాం గ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. రిజర్వేషన్ల పెంపుతో బీసీలంతా సంబరాలు చేసుకుంటుంటే బీఆర్ఎస్ నేతలు అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపిం చారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభు త్వ నిబద్ధతను ఎవరూ సవాల్ చేయలేరన్నారు. సా మాజిక న్యాయం, బీసీ రిజర్వేషన్ల అమలు కాంగ్రెస్ తోనే సాధ్యం అని రవి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు మేలు చేసేలా నిర్ణయా లు తీసుకుంటున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్ల ను వ్యతిరేకించే వారిని బీసీ సంఘాల నాయకులు, ప్రజలు నిలదీయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, విష్ణువర్ధన్, శివరాజ్ పాల్గొన్నారు.

కార్యాలయాలు ఏర్పాటు చేయాలని వినతి

ఆమనగల్లులో సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఎంపీ మల్లు రవిని గుర్రం కేశవులు, యాట నర్సింహ కోరారు. పట్టణంలో కార్యాలయాలు పట్టణం, గ్రామీణ మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీకి తెలిపారు. కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా చొరవ తీసుకోవాలని నాయకులు కోరారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.రవికి వినతిపత్రం అందజేసిన వారిలో మండ్లీ రాములు తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్‌లో ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం



వేంకటేశ్వరుడికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ముఖ ద్వారంగా వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్రాన్ని పురష్కరించుకుని స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాసచార్యుల నేతృత్వంలో లక్ష్మీవేంకటేశ్వరుల కల్యాణోత్సవాన్ని అనంతరం ఆలయం చుట్టు పల్లకీ సేవను నిర్వహించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న నాయకులు

ఘట్‌కేసర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించేందుకు శ్రమించాలని అంకుషాపూర్ మాజీ సర్పంచ్ రామలింగంగౌడ్ అన్నారు.ఆదివారం ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఏ దులాబాద్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో దాసు, నర్సింగరావు, సత్యం, రాజేష్, సురేష్, సుధాకర్, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో బిల్లు ఎందుకు తేలేదు?



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు రాణి

కేశంపేట,జూలై 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తాను ఉద్యమం చేస్తేనే బీసీ రిజర్వేషన్లొచ్చాయని చెప్పుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బిల్లు ఎందుకు తేలేదని కేశంపేట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాణి ప్రశ్నించారు. బీసీ బిల్లుకు బ్రాండ్ అంబాసిడర్ కాం గ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డిలే అని స్పష్టం చేశారు. గత శనివారం కాకునూర్‌కు వచ్చిన కవిత మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడంలేదని, మహాలక్ష్మి పథకం కింద ప్రతీ పేద మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని, సన్న బియ్యంలో నూకలు వస్తున్నాయని, పాలమూరు ప్రాజెక్టులను కాంగ్రెస్ పాలకులు పక్కనబెట్టారని తదితరాంశాలపై అసంబద్ధంగా మాట్లాడారని విమర్శించారు. ఆదివారం కొత్తపేటలో కాంగ్రెస్ నాయకురాళ్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ, సన్న బియ్యం వంటి పథకాలతో మహిళలు సంతోషంగా ఉంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్వడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 18నెలల్లోనే ప్రతీ పేదకు ఇంటిని నిర్మిస్తోందన్నారు. రానున్న మూడేళ్లలో పేదలకు మరన్ని పథకాలు అందుతాయని తెలిపారు. బీఆర్ఎస్‌కు వార్షిక పరీక్షల్లో(అసెంబ్లీ ఎన్నికల్లో) పాస్ మార్కులు, సప్లిమెంటరీ(ఎంపీ ఎన్నికల్లో) జీరోలొచ్చాయని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల్లోనూ గుండు సున్నాలే వస్తాయని మాజీ జెడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి అన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, కాంగ్రెస్ మండల నాయకురాళ్లు అరుణ, సుజాత, కళమ్మ, అస్మా, లలిత, సువర్ణ, లక్ష్మి, మణెమ్మ, నర్సమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

విపక్షాల అసత్య ప్రచారాన్ని కాంగ్రెస్ తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీసింగ్

కడ్తాల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని పీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కోరారు. ముద్విన్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బాలాజీ సింగ్ హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సోపానమన్నారు. రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయం అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం ఆమోదించడం సాహసోపేత నిర్ణయమన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ, పార్టీ పరంగా అవకాశాలు లభిస్తాయని చెప్పారు. స్వార్థ శక్తులు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ ప్రజాభిమానం ముందు దిగదుడుపే అన్నారు. పేదలందరికీ ప్రభుత్వం పథకాలను అందజేస్తుందన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బాలాజీసింగ్ అన్నారు. సమావేశంలో ఆమనగల్లు మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రేవంత్ మిత్రమండలి మండల అధ్యక్షుడు గంట నరేశ్, గ్రామాధ్యక్షుడు మధు, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు రామచంద్రయ్య, నర్సింహ, శ్రీశైలం, సురేందర్, మల్లేశ్, నర్సిరెడ్డి, వీరయ్య, వెంకటేశ్, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఐకృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీకేఆర్ ఫంక్షన్‌లో 9రోజులపాటు నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. చెన్నై శంకరన్ నేత్రాలయ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 6వేల మందికి కంటి పరీక్షలు చేశారు. 3వేల కళ్లద్దాలు అందజేశారు. దృష్టిలోపం ఉన్న 153 మందికి ఐఓఎల్ ఆపరేషన్లు చేయించారు. సుంకిరెడ్డి కళ్లద్దాలను పంపిణీ చేశారు. నేత్ర వైద్య శిబిరంలో సేవలందించిన వైద్యులు, సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులను సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కంటి సమస్యలతో ఎవరూ ఇబ్బంది పడకూడదనే తాను శిబిరాన్ని ఏర్పాటు చేశానని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా మున్ముందు కూడా శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు.ఫౌండేషన్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరిస్తామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఆరోగ్య సంరక్షణ ఐకృత ఫౌండేషన్ ధ్యేయమని రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్‌గౌడ్, యూసుఫ్, గణేశ్,యాదయ్య, కొండల్, శేఖర్, రమేశ్‌నాయక్, శ్రీపతి, రాఘవేందర్, శివ, శ్రీను, కల్యాణ్, మల్లేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు

ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్, జూలై 13, (ఆంధ్రజ్యోతి): జినుగుర్తిలోని బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆదివారం పేర్కొన్నారు. ఫస్టియర్ ఎంపీసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.


వికారాబాద్: ఎంబీజీ కాలనీలో పోచమ్మ తల్లికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


మేడ్చల్ టౌన్: అత్వేల్లిలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

అమ్మోరుకు బోనం

వికారాబాద్ జిల్లాలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలంతా బోనాలతో ఆలయాలకు వెళ్లి అమ్మవార్ల నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పాడిపంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ జూలై 13


పరిగి: మైసమ్మ దేవాలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు


కొడంగల్ రూరల్: రుద్రారంలో పోచమ్మతల్లికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


ధారూరు: బోనాలతో బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు

క్రైం కార్నర్

హత్య కేసులో దంపతుల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

మేడ్చల్ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చెత్త ఏరుకునే వ్యక్తి హత్యకు సంబంధించిన నిందితులను మేడ్చల్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ చెక్‌పోస్టు సమీపంలోని ఓ మద్యం దుకాణం వద్ద శనివారం రాత్రి ఓ వక్తి మృతదేహం కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతుడు నర్సింహులుగా గుర్తించారు. నర్సింహులు చెత్త ఏరుకుంటూ జీవనం సాగించేవాడని విచారణలో తేలింది. దీంతో పాటు నర్సింహులు మృతదేహంపై కర్రలతో చితకబాదినట్లు గాయాలు కనబడటంతో పోలీసులు హత్య జరిగినట్లు అనుమానం వ్యక్తం చేసి ఆదిశగా విచారణ చేపట్టారు. నర్సింహులుతో పాటు చెత్త ఎరుకునే పలువురిని విచారించారు. నర్సింహులుతో పాటు చెత్త ఏరుకునే నర్సింహ, అనిత అనే దంపతులతో గొడవ జరిగినట్లు తేలింది. దీంతో ఇద్దరిని అదుపులో తీసుకుని విచారించగా డబ్బుల విషయంలో నర్సింహులుతో గొడవపడి కర్రతో కట్టడంతో అతడు మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

మహిళలకు అక్షరాలు నేర్పేందుకు సర్వే

● వికారాబాద్ జిల్లా మెప్మా పీడీ రవికుమార్

ఫేస్ టూ ఫేస్



తాండూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో నిరక్షరాస్యులను గుర్తించేందుకు గతనెల 20వ తేదీ నుంచి ఆర్పీల ద్వారా ఉల్లాస్ కార్యక్రమం పేరిట సర్వే నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా మెప్మా పీడీ రవికుమార్ తెలిపారు. ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి మున్సిపాలిటీల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి : ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశ్యం?

మెప్మా పీడీ: నిరక్షరాస్యులైన 15 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి వారి పేర్లను సిస్టమ్‌లో నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఏవిధంగా అక్షరాలు నేర్పిస్తారు?

మెప్మా పీడీ: ముఖ్యంగా తెలుగులో రాయడం, చదవడం కోసం 10మందికి ఒకరు చొప్పున వలంటీర్లను నియమించి చదువుచెప్పే ప్రయత్నం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇందుకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందా?

మెప్మా పీడీ: ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదు. వారికి చదువు చెప్పేందుకు ఎన్‌జీవోలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: సర్వేను ఏ విధంగా నిర్వహిస్తున్నారు?

మెప్మా పీడీ: సర్వేను మహిళా సంఘాలు, వలంటీర్ల ద్వారా డోర్ టూ డోర్‌గా సర్వే నిర్వహిస్తున్నాం.

నాణ్యతకు తిలోదకాలు!

● అంగన్‌వాడీ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం? ● క్యూరింగ్ చేయకుండా వదిలేసిన వైనం


కొడంగల్ ఎస్టీ హాస్టల్ ఎదుట నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం

కొడంగల్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండాలనే ఉద్దేశంతో ప్రతీ మండల కేంద్రంలో రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు చేసింది. పట్టణంలోని ఎస్టీ హాస్టల్ ముందు రూ.20లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ తన ఇష్టారీతిన పనులు చేపడుతున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో నాసిరకం పనులు చేపడుతూ క్యూరింగ్ చేయకుండా వదిలేశాడు. పనుల్లో నాణ్యత పాటించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ రవికిరణ్‌రెడ్డిని వివరణ కోరగా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


స్లాబ్‌పై క్యూరింగ్ చేయకుండా వదిలేసిన దృశ్యం

బషీరాబాద్‌లో అంధకారం


బషీరాబాద్‌లో ప్రధాన రోడ్డులో వెలగని వీధిదీపాలు

బషీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీధిలైట్లు వెలగక పలు కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. ప్రధాన, అంతర్గత రోడ్ల పక్కన స్తంభాలకు కూడా లైట్లు వెలగక రాత్రుల్లో చీకట్లు కమ్ముకుని నానా అవస్థలు పడుతున్నామని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శి జయకర్ దృష్టికి తీసుకెళితే నిధులు లేవని చెబుతున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధిలైట్ల విషయమై ఎంపీడీవో విజయ్‌కుమార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితంలేదని స్థానిక యువకుడు జమీల్ ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీరు వృథా!


గౌళిగల్లిలో వృథాగా పోతున్న కుళాయి నీరు

బషీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గౌళిగల్లిలో పలుచోట్ల కుళాయిలకు ఆన్ ఆఫ్ సిస్టం సరిగాలేకపోవడంతో గంటల తరబడి నీళ్లు వృథాగా పోతున్నాయి. ఈ గల్లీలో డైరెక్టు పంపింగ్ సిస్టం ఉండటంతో నీరంతా వృథాగా పోతున్నట్లు తెలిసింది. పలు వార్డుల్లో ఇలాంటి సమస్యలే ఉన్నాయని, కుళాయిల ద్వారా నీటి వృథాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొత్త కార్డులొస్తున్నాయ్..

(ఐదో పేజీ తరువాయి)

రేషన్ కార్డుల్లో ఉన్న డూప్లికేట్ పేర్లు తొలగించారు. జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నారు, వాటిల్లో కొత్తగా ఎంత మంది సభ్యులు చేరారు, వారి కోసం ఎంత మొత్తంలో బియ్యం కేటాయించనున్నారనేది సోమవారం స్పష్టత రానుంది.

పదేళ్ల కాలంలో ఇదే ప్రథమం

పదేళ్ల కాలంలో జిల్లాలో అధిక సంఖ్యలో రేషన్ కార్డులు పంపిణీ చేయడం ఇదే ప్రథమం. కేంద్ర ప్రభుత్వం పదేళ్ల కిందట రేషన్ కార్డుల స్థానంలో ఆహార భద్రతాకార్డులు జారీ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో జిల్లాలో 2.20 లక్షల వరకు కార్డులు ఉండగా, అప్పుడప్పుడు కొన్ని కార్డులు జారీ చేయగా, కొన్ని కార్డులను రద్దు చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనవరి 26న కొత్త రేషన్‌కార్డుల పంపిణీపై ప్రకటన చేసింది. శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి మే 28వ తేదీ వరకు జిల్లాలో 9,928 కొత్త రేషన్ కార్డులు జారీ చేయగా, ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు నాలుగు వేలకుపైగా కొత్త రేషన్ కార్డులు ఆన్‌లైన్‌లో జారీ చేసినట్లు తెలుస్తోంది. రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చుకుంటూ, పాత రేషన్ కార్డుల్లోని ఉమ్మడి కుటుంబాల్లో వివాహాలైన వారిని, ఇళ్లలో లేని వారిని, మృతి చెందిన వారిని తొలగించారు. వివాహం చేసుకుని జిల్లాకు వచ్చిన యువతులు, కొత్తగా జన్మించిన పిల్లలను చేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు.

అట్టహాసంగా పంపిణీ ప్రక్రియ!

రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా సోమవారం సూర్యాపేట జిల్లా, తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తుండగా వికారాబాద్ జిల్లాలో కూడా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయనున్న కొత్త రేషన్ కార్డులు సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోనున్నాయి. సభలు ఏర్పాటు చేసి కొత్త లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు.

వికారాబాద్‌కు రేపు మందకృష్ణ మాదిగ రాక

పూడూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన వికారాబాద్‌కు మంగళవారం(రేపు) ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు ఎమ్మార్పీఎస్ పూడూరు మండల అధ్యక్షుడు యేసు మాదిగ తెలిపారు. మండలంలోని మేడిపల్లి కలాన్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు యేసు, మండల ఇన్‌చార్జి చిట్టిగిద్ద కృష్ణ మాట్లాడారు. ఈనెల 15వ తేదీన జిల్లాలో జరిగే సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి చిట్టిగిద్ద కృష్ణ మాదిగ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసు, నర్సింహ, శేఖర్, దిలీప్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం


నరేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బంట్వారం జూలై 13: (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతామని ఆ పార్టీ బంట్వారం మండల అధ్యక్షుడు దుర్గం చెరువు మల్లేశం అన్నారు. మండల కేంద్రంతో పాటు తొర్మామిడి, నాగ్వారం, సల్బత్తాపూర్, మాలసోమరం, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో ఆదివారం పార్టీ గ్రామకమిటీల అధ్యక్షులను ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ బంట్వారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గుర్రం నరేష్, మాలసోమరం విష్ణుగౌడ్, తొర్మామిడి ప్రకాశం, నాగ్వారం అంతప్ప, సల్బతాపూర్ అనంతి, సుల్తాన్‌పూర్ వీరేశంలను నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, ఖాజపాష, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం


జ్ఞానేశ్వర్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

కులకచర్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పదవీ విరమణ పొందిన హైదరాబాద్‌లోని మీర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రెడ్డిపల్లి జ్ఞానేశ్వర్‌ను ఆదివారం కులకచర్లలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. గతంలో జ్ఞానేశ్వర్ కులకచర్ల పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. జ్ఞానేశ్వర్ ఎక్కడ పనిచేసిన ప్రజల మన్ననలు పొందారని, తోటి ఉద్యోగులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు, పరిగి ఇన్‌చార్జి మారుతి కిరణ్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

రేపు వాలీబాల్ టోర్నమెంట్

తాండూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జినుగుర్తి గ్రామంలో మంగళవారం (రేపు) వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పి.రాములు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30గంటలకు టోర్నమెంట్ ప్రారంభమవుతుందని చెప్పారు. గౌరవ అతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ కుమార్, ముఖ్యఅతిథులుగా రూరల్ సీఐ నగేష్, గ్రామ కార్యదర్శి రాములు హాజరు కానున్నట్లు తెలిపారు.

కల్తీ కల్లోలం

(ఐదో పేజీ తరువాయి)

చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. కూకట్‌పల్లి ఘటనతో జిల్లాలో ఎక్సైజ్ అధికారులు కల్లు దుకాణాలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. కల్లు దుకాణాల్లో శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపుతున్నారు. ల్యాబ్ రిపోర్టులు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

విచ్చలవిడిగా దుకాణాల ఏర్పాటు

ఎక్సైజ్ శాఖ నుంచి లైసెన్స్‌లు పొందిన వారే కల్లు దుకాణాలను నిర్వహించాల్సి ఉంటుంది. తాడి కోఆపరేటివ్ సొసైటీ(టీసీఎస్)లో సభ్యులుగా ఉన్న వారికే అవకాశం ఉంటుంది. ఒక్క లైసెన్స్‌తో ఆ దుకాణంలో సమీప ప్రాంతాల్లో మరో నాలుగు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. అనుబంధ దుకాణాలుగా నడిపిస్తున్నారు. కల్లు కాంపౌండ్లపై ఎక్సైజ్ అధికారులు తరుచూ దాడులు నిర్వహించకపోవడంతో విచ్చలవిడిగా కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయి. కల్లుకు బానిసైన వారికి అనారోగ్యంతో పాటు కుటుంబాల్లో తరుచూ గొడవలు, కొట్లాటలు జరుగుతున్నాయి.

ఒక్క కిలోతో వెయ్యి లీటర్లు!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రెండు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు ఎక్సైజ్ స్టేషన్‌లున్నాయి. వీటి పరిధిలో నాలుగేళ్లలో కల్తీ కల్లు దుకాణాలపై ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క కేసు మాత్రమే నమోదైంది. కల్తీ కల్లు తయారీకి ఉపయోగించే క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలమ్‌ను ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్నదీ లేదు. కల్లు దుకాణాల్లో క్లోరల్ హైడ్రేట్, డైజోఫాం వంటి మత్తు పదార్థాలతో కల్తీ కల్లు తయారు చేస్తున్నారు. కిలో క్లోరల్ హైడ్రేట్‌తో వెయ్యి లీటర్ల కల్లు తయారు చేస్తున్నారు. కల్తీ కల్లు తయారీకి వాడే రసాయానాలను గుట్టుచప్పుడు కాకుండా ఇతర జిల్లాల నుంచి తెప్పిస్తున్నట్లు సమాచారం. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీకల్లు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


భూమిపూజలో కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కులకచర్లలో ఆదివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజలో పాల్గొన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, గోపాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్, ఆనంద్ పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

కులకచర్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పర్యటించనున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాంబండ దేవాలయ ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటుతారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, కృష్ణారెడ్డి, రవినాయక్, రాంచంద్రయ్య, భరత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.2లక్షల ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

ధారూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మున్నూర్ సోమారం గ్రామానికి చెందిన బైండ్ల సువర్ణకు రూ.2లక్షల ఎల్‌వోసీని ఆదివారం వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్, విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్‌లు అందజేశారు. శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ చొరవతో ఆమెకు ఆస్పత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుజ్జయ్య గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

దిగబడిన ఆర్టీసీ బస్సు


వడిచర్ల రోడ్డుపై దిగబడిన బస్సు

బొంరాస్‌పేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వడిచర్ల రోడ్డుపై ఆర్టీసీ బస్సు దిగబడింది. వడిచర్ల రోడ్డు మరమ్మతుల కారణంగా రోడ్డుపై పోసిన మట్టిలో తాండూరు డిపోకు చెందిన బస్సు దిగబడింది. దీంతో వడిచర్ల గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ధారూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ధారూరులో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఉండాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుపరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రమౌళి, రాములు, చిన్నయ్యగౌడ్, అంజయ్య, హఫీజ్, చెన్నయ్య, భీంసేన్, నాగేష్‌గౌడ్, యాత్రా గౌడ్, లక్ష్మయ్య, మహేష్, బస్వరాజ్, అనంతయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్య సేవలు


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దోమ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు కృష్ణ, రమేశ్, శేఖర్ అన్నారు. మండలంలోని ఉదన్‌రావుపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ మైనోద్దీన్‌కు ఆదివారం రూ.60వేలు, నీరటి అనురాధకు రూ.18వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లప్ప, గోపాల్, ఆంజనేయులు, గోపాల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా కాంగ్రెస్ వైపు


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలోని గంగారం కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్, నాయకులు రాజు, ఉస్మాన్, శంకర్, రాములు పాల్గొన్నారు.

బాల్యమిత్రుల ఆర్థిక సాయం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన బాల్యమిత్రుని కుటుంబసభ్యులకు ఎదులాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. ఎదులాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-2005 బ్యాచ్‌కు చెందిన నీరుడి నర్సింగ్‌రావు ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఆదివారం నర్సింగ్‌రావు బాల్యమిత్రులు రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 2004-2005 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కులకచర్ల: పుట్టపహాడ్ ఉన్నత పాఠశాలలో 1998-1999 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన గాడిర్యాల్ గ్రామానికి చెందిన మోహన్, హనుమంతులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. అప్పట్లో వీరితో పాటు పదోతరగతి చదివిన తోటి స్నేహితులు స్పందించారు. గాడిర్యాల్ గ్రామానికి ఆదివారం వెళ్లి బాధిత కుటుంబాలకు రూ.35వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

విద్యుద్దీపాల అందజేత


విద్యుత్‌దీపాలను అందజేస్తున్న రాజు

తాండూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపూర్ గ్రామం వివేకానంద యువసేనా సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉప్పరి రాజు సహకారంతో విద్యుద్దీపాలను అందజేశారు. ఆదివారం గ్రామ సెక్రెటరీ రవికుమార్‌కు విద్యుత్ బల్బులను అందజేసి వెంటనే ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉప్పరి నర్సింహులు, బాల్‌రెడ్డి, భీంరెడ్డి, ఉప్పరి యాదప్ప, మాల యాదప్ప, వడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ

చౌడాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విఠలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లాటి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుచ్చయ్య, రాంచందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బుచ్చయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ, కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి దామోదర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్యగౌడ్, సలీమ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు చెన్నయ్య, ఎస్టీసెల్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్ ఎస్ఐగా రమణ

బొంరాస్‌పేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ నూతన ఎస్ఐగా రమణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ కాగా ఆయన స్థానంలో రమణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

కోట శ్రీనివాసరావు మృతికి స్పీకర్ సంతాపం

వికారాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. 750కి పైగా చిత్రాల్లో విలక్షణమైన పాత్రల్లో తన నటతో అలరించిన కోట శ్రీనివాస్ రావు మృతి సినీలోకానికి తీరనిలోటని తెలిపారు. ఆయన ఆత్మకు భగవంతుడు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు స్పీకర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.